క్లుప్తంగా

పౌష్టికాహార కిట్లు అందజేత

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్లబ్ జిల్లా గవర్నర్ తీగల మోహన్‌రావు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పాగనల్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఈసీజీ మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, విద్యాసాగర్, అశోక్, సతీష్‌కుమార్, అశోక్‌రెడ్డి, లింగయ్య, డాక్టర్ పుల్లారావు, యాదయ్య, ఎల్‌వీ కుమార్, నర్సిరెడ్డి, నిమ్మల పిచ్చయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రంగారెడ్డి

మర్రిగూడ : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిగూడ ఎస్‌ఐ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఆన్‌లైన్ మోసాలపై ఎస్‌ఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన వివరాలతోపాటు పలురకాల బహుమతులు వచ్చాయని ఎవరైనా ఎర చూపితే వివరాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి, సిబ్బంది సైదులు, రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

రామగిరి(నల్లగొండ) : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన నల్లబోతు మధు పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ఈక్రమంలో మేత కోసం వెళ్లిన గేదెకు తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని మధు కోరారు.

15వ రోజుకు చేరిన రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న వృద్ధులు

మునుగోడు : మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 15వ రోజుకు చేరాయి. అందులో భాగంగా వృద్ధులు దీక్షలో పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, నందిపాటి వెంకన్న, మునుకుంట్ల భూపాల్, పంతంగి రవి, బుజునూరి వెంకట్‌రెడ్డి, సిగ్నమెట్ల నరసింహ, మునుకుంట్ల అంజయ్య, పిచ్చయ్య, నర్సింహ, జాజుల వెంకటయ్య, పర్వతాలు, యాదగిరిరెడ్డి, నరేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ తేజస్వి

శాలిగౌరారం : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వీ, వైస్ ఎంపీపీ కందుల అనితారెడ్డి అన్నారు. మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. మండల వైద్యాధికారి వెంకన్న, ఉప సర్పంచ్ శేషరాజుపల్లి సునితారామచంద్రయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేషరాజుపల్లి వెంకన్న తదతరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని సుంకెనెపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ కక్కిరేణి బోందయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నర్సింహ, వార్డు సభ్యులు బాతరాజు రమేష్, కొత్త యాదమ్మ, ఆవుల సునిత, అంబాల నర్సింహ, గుడ్డేటి రజి, సోమలింగం, నాయకులు బల్గూరి సైదులు, యాకారి నరేందర్ పాల్గొన్నారు.

మార్కెట్ స్థలం పరిశీలన

శాలిగౌరారం : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.46 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థలాన్ని శుక్రవారం వ్యవసాయ మార్కెట్ డీఈ కర్ణాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 7న భవన నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రారంభించనున్నందున స్థల పరిశీలన జరిపినట్లు డీఈ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ ఏఈ అశోక్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జీవాలకు తప్పని గ్రాసం కొరత !

- ట్రాక్టర్ గడ్డికి రూ.8వేలకు పైనే
- ఇతర మండలాల నుంచి కొనుగోలు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు


ఇతర మండలాల నుంచి మర్రిగూడకు ట్రాక్టర్‌లో తీసుకొస్తున్న గడ్డి

మర్రిగూడ : సాగు నీటి వనరులు సరిపడా లేకపోవడంతో మర్రిగూడ మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పశువులకు గడ్డి కూడా ఇతర మండలాల నుంచి కొనుగోలు చేసి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రాసం కొరతతో మండలంలోని జీవాలు అల్లాడుతున్నాయి. ఇతర మండలాల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.8వేల నుంచి రూ.15వేల వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చండూరు, కనగల్ నుంచి గ్రాసం కొనుగోలు

మండల వ్యాప్తంగా 4,283 పశువులు, 3,082 గేదెలు, 21,006 గొర్రెలు, 12,497 మేకలు ఉన్నాయి. మూగ జీవాలకు సరిపడా గ్రాసం అందకపోవడంతో వేసవికాలంలో చండూరు, కనగల్ మండలాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు. అయితే ఇప్పటికే ఈ ఏడాది 5వేల టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేసినట్లు పశువైద్యులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు యాసంగి, వానాకాలంలో పత్తి 30,453 ఎకరాల్లో, వరి 5,076 ఎకరాల్లో, కంది 84 ఎకరాల్లో సాగు చేశారు. అయినా గ్రాసం సరిపోవడం లేదు.

రిజర్వాయర్ పూర్తయితేనే..

అత్యధికంగా ఫ్లోరైడ్ జలాలు ఉన్న మండలం మర్రిగూడ. పాడి పశువులు తాగు నీరు, పంట పండించేందుకు ఫ్లోరైడ్ నీరే దిక్కు. పాడి పశువుల నుంచి పొందే పాల ద్వారా, సాగు చేసే పంటల ద్వారా తీసుకునే ఆహారంలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంటోంది. ఈ ప్రాంతంలో శివన్నగూడ రిజర్వాయర్ పూర్తయితే ఫ్లోరైడ్ భూతం పూర్తిగా అంతం కానుంది.

వైద్యం అందక మూగజీవాల మృత్యువాత..

మర్రిగూడ మండల కేంద్రంతోపాటు శివన్నగూడ పశు వైద్యశాలలో పశువైద్యులు, ఇన్‌చార్జ్‌లతోపాటు అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్‌లు ఉన్నారు. కొండూరులో ఉన్న సబ్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆ కేంద్రం మూతపడిపోయింది. జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రాసం కొరత తీర్చడంతోపాటు సరిపడా పశువైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల పాడి రైతులు కోరుతున్నారు

ట్రాక్టర్ గడ్డికి రూ.8వేలు

కనగల్ మండలం నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ.8వేలకు కొనుగోలు చేశా. మా ప్రాంతంలో నీరు తక్కువగా ఉంది. శివన్నగూడ రిజర్వాయర్ పూర్తయితే గడ్డి కొనుగోలు చేయడం తప్పుతుంది.

-ఎన్.రవి, సరంపేట

నాలుగున్నర టన్నుల విత్తనాలు సరఫరా చేశాం



ఈ ఏడాది పాడి రైతులకు పచ్చి గడ్డి కోసం దాదాపు నాలుగున్నర టన్నుల గడ్డి విత్తనాలు సరఫరా చేశాం. వేసవికాలం కావడంతో వరి గడ్డి కోసం కొందరు రైతులు గ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు ముందస్తు ప్రణాళిక ఏర్పరుచుకుని పాడి పశువులను సంరక్షించుకోవాలి.

-స్వామి, ఇన్‌చార్జ్ పశువైద్యుడు, మర్రిగూడ

వైభవంగా శ్రీ బాలనర్సింహస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, తదితరులు

చిట్యాల : పట్టణ శివారులోని శ్రీ బాలనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీలక్ష్మీ, అండాలు సహిత నర్సింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి వాచనం, గరుడ ముద్ద, హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అందంగా అలంకరించిన శ్రీలక్ష్మీ, అండాలు సహిత నర్సింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించారు. తలంబ్రాలతోపాటు బంగారు పుస్తె, మెట్టెలను బొబ్బల శివశంకర్‌రెడ్డి–శ్వేత దంపతులు అందజేశారు. ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని వాస విద్యాసాగర్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, ఆలయ చైర్మన్ కాకులారపు బొర్రారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, వనమా వెంకటేశ్వర్లు, గుండెబోయిన సైదులు, బెల్లి సత్తయ్య, పందిరి గీతారమేష్, జిట్ట పద్మ బోందయ్య, కోనేటి కృష్ణ, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, చిత్రగంటి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


బుద్ధుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విగ్రహాల పరిరక్షణ కమిటీ నాయకులు


నివాళులర్పిస్తున్న విద్యుత్ ఎస్‌ఈ చంద్రమోహన్

నల్లగొండ : ఆర్యన్స్ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని యోగా ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం బుద్ధ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడి విగ్రహానికి చొక్కరపు మాధవి, యోగా గురూజీ సంధ్య జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో డా. ప్రణతి, కల్పన, కరుణ, సీడీపీఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్ : మర్రిగూడ బైపాస్ విగ్రహాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కత్తుల సహదేవ్, బొజ్జ నాగయ్య, ఊట్కూరి వెంకట్‌రెడ్డి, బొజ్జ శంకరయ్య, గోపి, వెంకన్న , బీపంగి యాదయ్య, నరహరి, పురుషోత్తం, రమేష్, రాధ, శేఖర్, మేడి యాదయ్య, ఎల్లేష్, సత్యనారాయణ, నాగిరెడ్డి, కృష్ణ, రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళలు

రామగిరి(నల్లగొండ): బుద్ధ పౌర్ణమి సందర్భంగా మునుగోడు రోడ్డులోని హౌజింగ్ బోర్డులో బుద్ధవందనం, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధుడికి విద్యుత్‌శాఖ ఎస్‌ఈ చంద్రమోహన్, డీఈ శంకరయ్య నివాళులర్పించారు. మాతంగి చక్రవర్తి ఆధ్వర్యంలో ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ శ్రీరాములు, సోమ వెంకటేశ్వర్లు, ఇడుకుళ్ల నర్సింహ, వినోద్‌కుమార్, సురేష్‌కుమార్, ప్రసాద్, చక్రవర్తి, సత్యనారాయణ, యోగా గురువులు కర్ణాకర్, శివ, వెంకటయ్య, యాదమ్మ, జ్యోతి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల పంపిణీ హామీ నెరవేర్చాలి

చండూరు : భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్ల పంపిణీ చేస్తామని గతేడాది మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం అంతంపేట గ్రామంలో జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సైదులు, గూడపు నర్సింహ, సీహెచ్.కృష్ణయ్య, యాదయ్య, రామచంద్రం, కృష్ణయ్య, మహేష్, హన్మంతు తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

కేతేపల్లి : ఈ నెల 8న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేదాసు శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తుంగతుర్తి గ్రామంలో నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా వేదాసు శ్రీధర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సమావేశంలో ఎండీ.యాసు ఫ్జానీ, అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, గుండా జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం


నార్కట్‌పల్లిలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. వర్షానికి తడిసి ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణిస్తూ దిగుమతి చేసుకునేవిధంగా మిల్లర్లతో మాట్లాడతానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్‌నాయక్‌లు ఉన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆర్టీసీ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆర్టీసీ స్థలం రోడ్డు పక్కన అధికంగా ఉన్నందున కాంప్లెక్స్ ఏర్పాటు చేసినట్లయితే ఆర్టీసీకి ఆదాయం పెరగడంతోపాటు చిరు వ్యాపారులకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు విస్తరణ పనులను పది రోజుల్లో ప్రారంభిస్తున్నందున ప్రస్తుతం రోడ్డు వెంట ఉన్న చిరువ్యాపారులు ఇతర ప్రాంతాల్లో వ్యాపారం చేసుకునేందుకు దుకాణాలను సమకూర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం వెంకటమ్మ, కో ఆప్షన్ సభ్యులు వాజీద్ అలీ, ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.

పంట మార్పిడి అవలంబించాలి

కేతేపల్లి : రైతులు తమ వ్యవసాయ భూముల్లో పంట మార్పిడి విధానాన్ని అవలంబించి సాగును లాభదాయకంగా మార్చుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో శంకర్ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వేరు శనగ పంటను పరిశీలించారు. పంటసాగు విధానం, పెట్టుబడి, ఆదాయం వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. పంట మార్పిడి జరిగితేనే వ్యవసాయం లాభదాయకమవుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్నాటకలో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని కర్నాటకలో ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టడాన్ని నిరసిస్తూ నల్లగొండ పట్టణంలోని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, దాసోజు యాదగిరాచారి, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, పాలకూరి రవిగౌడ్, రావెళ్ల కాశమ్మ, దర్శనం వేణు, గూండా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాటం నిర్వహిస్తాం

నల్లగొండ రూరల్ : మైనింగ్ తవ్వకంతో నష్టపోకుండా రైతుల పక్షాన పోరాటం నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న గాయిత్రి మైనింగ్ స్థలాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ తవ్వకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ తవ్వకంతో సమీపంలో ఉన్న చెరువు నీరు కలుషితం అవుతుందని, రైతుల బోర్లు ఎండిపోతాయని, పంటల దిగుబడి రాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాంబయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రుక్మాగౌడ్, మహేష్, మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీ కదలాలంటే.. డబ్బులు ఇవ్వాల్సిందే !

- పైసలివ్వకుంటే మిల్లుకు తరలించని లారీ డ్రైవర్లు
- రైతుల వద్ద వడ్లు వసూలు చేస్తున్న కేంద్రాల నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు


కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం

రామగిరి(నల్లగొండ) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. అయినప్పటికీ రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. తిప్పర్తి మండలంలో 8 ఐకేపీ కేంద్రాలు, 10 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత నెల 12వ తేదీన కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఐకేపీ కేంద్రాల ద్వారా 65వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. మరో 80 వేల క్వింటాళ్లు కొనాల్సి ఉంది. పీఏసీఎస్ కేంద్రాల ద్వారా లక్షా ముప్పై రెండు వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా సుమారు ఒక లక్షా అరవై వేల క్వింటాళ్ల ధాన్యం కొనాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై దాదాపు నెల కావొస్తున్నా యాభై శాతం వరకు ధాన్యం మాత్రమే సేకరించారు. కేంద్రాల్లో ధాన్యం రాశులతో రైతులు పడిగాపులు కాస్తున్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న లారీ డ్రైవర్లు

ఒక వైపు మిల్లర్ల కొర్రీలకు తోడు వర్షాలకు రైతులు ఆందోళన చెందుతుంటే తిప్పర్తి మండలంలోని మామిడాల ఐకేపీ సెంటర్‌లో కొంత మంది నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. బస్తా ధాన్యానికి రూపాయి ఇస్తేనే మిల్లులకు తరలిస్తామని లారీ డ్రైవర్లు రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. సీరియల్ ప్రకారం కాంటాలు వేసిన రైతులను పట్టించుకోకుండా డబ్బులు ఇచ్చిన రైతుల బస్తాలను మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా పట్టనట్లు నిర్వాహకులు చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులకు విన్నవించినా ఏమీ చేయలేని పరిస్థితి.

వడ్లు వసూలు చేస్తున్న నిర్వాహకులు

మామిడాల ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కేంద్రం నిర్వహణ చేయాల్సిన వారే రైతుల నుంచి వడ్లు తీసుకుంటున్నారు. కాంటా వేయడానికి రైతుల నుంచి బస్తా, రెండు బస్తాల వరకు వడ్లు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకు ఇవ్వాలని రైతులు ప్రశ్నిస్తే నాణ్యత, తేమ పేరుతో కాంటా వేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చివరికి చేసేదేమీ లేక రైతులు నిర్వాహకుల డిమాండ్‌కు తలొగ్గుతున్నారు.

ధాన్యం మొలకలొచ్చాయి



నెల రోజుల క్రితం ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. లారీల కొరత వల్ల కొనుగోలు చేయలేదు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. 5 బస్తాల వరకు ధాన్యం మొలకలొచ్చాయి. చాలామంది రైతుల ధాన్యం వర్షానికి మొలకెత్తి నష్టం వాటిల్లింది. కాంటాలు త్వరగా వేసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

-ఏ.యాదయ్య, మామిడాల

డబ్బులు ఇవ్వలేదని బస్తాలు తరలించలేదు



5 ఎకరాల సాగు చేయగా 376 బస్తాలు అయింది. వారం రోజుల క్రితం వడ్లు కాంటా వేశారు. అధికారులు కేంద్రానికి రెండు లారీలు పంపారు. అయితే లారీ డ్రైవర్ బస్తాకు రూపాయి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వలేదని లారీ డ్రైవర్ బస్తాలు తీసుకెళ్లలేదు. గోదోరిగూడెం కొనుగోలు కేంద్రంలో డబ్బులు ఇస్తానని చెప్పడంతో ధాన్యం బస్తాలను వదిలేసి వెళ్లాడు. అధికారులు స్పందించి లారీ డ్రైవర్లను నియంత్రించాలి.

-మహబూబ్ అలీ, మామిడాల

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో అభివృద్ధి జరుగుతున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం రాబోతున్నందున పనులు జరిగే ప్రాంతాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అపార్ట్‌మెంట్‌లు నిర్మించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని బిల్డర్లకు సూచించారు. భవనాల నిర్మాణాల్లో మైనర్లతో పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా నిర్మించే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ శివ, బిల్డర్లు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి స్వీట్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం


స్వీట్లు కొనుగోలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని రామగిరి సెంటర్‌లో పుల్లారెడ్డి స్వీట్ షాపు నూతన బ్రాంచ్‌ను శుక్రవారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు యామ కవిత దయాకర్, ఖయ్యుంబేగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గాదె వినోద్‌రెడ్డి, స్వీట్ సెంటర్ నిర్వాహకుడు బండ శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, బక్క పిచ్చయ్య, బండ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌కు సన్మానం


పల్లె రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మర్రిగూడ మండల నాయకులు

మర్రిగూడ : తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్‌గా ఉత్తర్వులు అందుకున్న పల్లె రవికుమార్ గౌడ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో మర్రిగూడ మండల బీఆర్‌ఎస్, గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్, పందుల రాములుగౌడ్, ఐయిలి నరసింహగౌడ్, యాదగిరిగౌడ్, పందుల యాదయ్యగౌడ్, కొంపల్లి నాగరాజు, చల్లం పాండురంగారావు, వెంకటేష్, యాదగిరి, జాని తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


నకిరేకల్ : ర్యాలీ నిర్వహిస్తున్న వీఓఏలు

నకిరేకల్ : తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ నకిరేకల్‌లో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల వీఓఏలు నకిరేకల్‌లో ర్యాలీ నిర్వహించారు. వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. వీరికి కాంగ్రెస్ నేత దైద రవీందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, వంటెపాక వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వీఓఏల సంఘం అధ్యక్షులు గద్దపాటి నగేష్, లలిత, నాగమణి, భద్రయ్య, సువర్ణ, రేణుక, సులోచన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో రంగినేని చంద్రకళ, గంటా మంజుల, పద్మ, శోభ, డబ్బు జ్యోతి, కదారి యాదమ్మ, ఐతగోని విజయ, శాంతి, సరిత పాల్గొన్నారు.

8వ రోజుకు చేరుకున్న జూనియర్ కార్యదర్శుల సమ్మె

చిట్యాల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సందర్శించి మద్దతు తెలిపారు.

మర్రిగూడ : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో షాకీర్, లక్ష్మీ, శిరీష, రాకేష్, మౌనిక, పార్వతి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

మాడుగుపల్లి : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల సీతారాంరెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలను నిరసిస్తూ, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిని దిగ్బంధించి బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీతారాంరెడ్డి మాట్లాడారు. ధర్నా కారణంగా రహదారిపై అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక అధికారులు సర్ది చెప్పడంతో కిసాన్ మోర్చా నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దమాం వెంకన్న, జిల్లా కార్యదర్శి నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకుడు జాన్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.